నేడు 'స్పందన'

కడప కార్పొరేషన్: ప్రజా సమస్యల పరిష్కారానికి కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పర్ భద్రతో 'సీమ'కు ముప్పు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమకు ముప్పు ఏర్పడుతుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర బడ్జెట్‌లో రూ. 5300 కోట్లు కేటాయించడంతో రాయలసీమ నీటి వనరులకు ముప్పు ఏర్పడుతుందన్నారు. కర్ణాటకలో త్వరలో జరగనున్న ఉన్నికల్లో లబ్ధి పొందేందుకు రెండు రాష్ట్రాలలోని కరువు ప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టించడానికి బీజేపీ సిద్ధమైందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

పాఠశాలకు వితరణ

కడప సెవెన్‌రోడ్స్ : లింగాల మండలం వెలిదండ్ల గ్రామంలోని మహాత్మాగాంధీ పాఠశాలకు ప్రముఖ సంఘ సేవకులు సిరాజుద్దీన్ రూ.10 వేల వితరణ అందజేశారు. ఆదివారం కడపలో ఐఈఆర్‌టీ యశోద తమ పాఠశాల ప్రిన్సిపాల్ చిన్న హరికుమార్ తరఫున సిరాజుద్దీన్‌ను సత్కరించారు.

సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన చర్చాగోష్ఠి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. వారి ఆర్థిక ప్రయోజనాలు పరిగణలోకి తీసుకుని చర్యలు చేపట్టాలన్నారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, నాయకులు నాగరాజు, వేణుగోపాల్, అనిల్‌కుమార్, కొండయ్య పాల్గొన్నారు.

పేద, బడుగువర్గాలంతా జగనన్న వెంటే

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్ బాషా అన్నారు. ఆదివారం స్థానిక 42వ డివిజన్‌లో 90వ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా...మీకు ఎంత లబ్ధి జరిగింది అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఎవరైనా అర్హులకు పథకాలు అందకపోతే అందించాలని ఆదేశించారు. జగనన్న ప్రభుత్వంలో తమకు వివిధ పథకాల ద్వారా రూ.9.66లక్షల లబ్ధి చేకూరిందని పలువురు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ లక్ష రూపాయల నుంచి రూ.12లక్షల వరకూ మేలు జరిగిందని, వారంతా ప్రభుత్వ పాలన పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్, తహసీల్దార్ శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మలకుంట శివశంకర్, షఫీ, నాగేంద్రారెడ్డి, మియ్యా, బండి ప్రసాద్, తోటక్రిష్ణ, పస్తం అంజి, అర్జున్, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, నారాయణమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఏపీపై సవతి తల్లి ప్రేమ చూపిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్ముకుంటూ రాష్ట్రానికి కేటాయించాల్సిన నిధులను ఇవ్వకుండా నిర్లక్ష్యం చూపడం తగదన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమకు ఒక్క రూపాయి కూడ కేటాయించకపోవడం దారుణమన్నారు. చార్లెస్, చంద్రశేఖర్ రెడ్డి, శివ, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయ సంఘాలు కృషి చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో శివార్జున, గంగరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

స్టార్ పవర్ టూల్స్ షాపు ప్రారంభం

కడప కార్పొరేషన్: కడప నగరంలోని చిలకలబావి వద్ద స్టార్ పవర్ టూల్స్ షాపును జిల్లా ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పవర్ అల్తాఫ్, నగర అధ్యక్షుడు నరేంద్ర కుమార్(చిట్టి), ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షాపు యజమాని మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.